RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

గురువారం 10 - 09 - 2026

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చొరవతో ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు నీటి విడుదల.**

3లో

# గాంధీ గంజ్ మార్కెట్ లో సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తాం.

-మార్కెట్ అభివృద్ధికీ కాంగ్రెస్ పార్టీ తోడ్పాటు
-నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి
-రిటైల్ కూరగాయల వ్యాపార మడిగెల ప్రారంభ మహోత్సవ కార్యక్రమం.




నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 9(ప్రజాగళం ) గాంధీ గంజ్ మార్కెట్ లో రిటైల్ వర్తకుల. రైతుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తా మని, మార్కెట్ అభివృద్ధికీ కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. బుధవారం గాంధీ గంజ్ మార్కెట్ యార్డ్ లో నూతన రిటైల్ కూరగాయల వ్యాపార మడిగెల ప్రారంభ మహోత్సవ కార్యక్రమం ఏఐటీ యూసీ అద్యక్షులు ఓమయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, మార్కెట్ లో నూతన రిటైల్ కూరగాయల వ్యాపార మడిగెల సముదా యాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించా రు..ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పెద్ద పీట వేస్తుందన్నారు. మార్కెట్ కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ కుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అందులో భాగంగా 40 రిటైల్ మడిగేలను అర్హులకు అందేలా చేశామన్నారు. ఇంకా మిగిలిన వారికి కూడా త్వరలోనే అందేలా చూస్తామన్నారు. మార్కెట్ రోడ్డు లో ప్రమాదాలు జరుగుతున్నాయనీ గ్రహించి వాహనాలు లోనికి రాకుండా ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చేస్తామన్నారు. ఇక్కడ కూరగాయలు అమ్ముకునే రైతులకు, వ్యాపారస్తులకు అందరికీ వసతి సౌకర్యం కల్పించాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు కోర్ట్ కు వెళ్ళడంతో పెండింగ్ పడిందని, రైతులందరికి మార్కెట్ చుట్టు ఇదే రకంగా కూరగాయలు అమ్ముకునేలా మడిగేలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు పాడి పంటలతో బాగుండాలని అప్పుడే జిల్లా రాష్ట్రం బాగుంటుందన్నారు. మార్కెట్ లో ఎలాంటి ఇబ్బంది లు జరుగకుండా చర్యలు తీసుకుంటామని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సాయత్రం పూట వాహనాలతో ఇక్కడ నడవలేని పరిస్థితి ఉందనీ ఈ సమస్యకు పరిష్కారం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎంఎల్ఏ భూపతి రెడ్డి దృష్టికి మార్కెట్ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం జరిగేలా చూస్తామన్నారు. మార్కెట్ అభివృద్ధికి తన వంతు కృషిని అందిస్తానన్నారు. వర్తకులు, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ రిటైల్ వ్యాపారుల తో పాటు అందరికి సౌకర్యాలు కల్పించాలనీ, మార్కెట్లో నీటి సమస్య ఉందని పరిష్కరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. చిరకాల డిమాండ్ ను రిటైల్ వ్యాపారులు, రైతులు పోరాడి సాధించుకున్నరన్నారు. టెండర్ ద్వారా మడిగేలు పొందిన అందరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ మార్కెట్లో ఇబ్బందులు పడుతున్న వర్తకుల, రైతుల సమస్యల కోసం గత ప్రభుత్వం లో ఎన్నో పోరాటాలు చేసామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి దృష్టికి సమస్యలు తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. వర్తకుల మడిగేలు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందనీ, అర్హులైన మిగతా వారందరికీ మడిగేలు వచ్చేలా చూస్తామన్నారు. ఇతర జిల్లాలలో ఉన్న మాదిరిగా ఇంటిగ్రేట్ మార్కెట్ లను ఆధునీకరించి మడిగేలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. మార్కెట్లో ఎవరైతే లైసెన్సులు పొందిన వారు ఉన్నారో వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది అన్నారు. రైతులకు కూడా కూరగాయలు అమ్మడానికి లైసెన్సులు ఇవ్వాలని అడగటం జరిగిందన్నారు. కొంతమంది కోర్ట్ కు పోవడం మూలంగా అందరికీ ఇవ్వడానికి సాధ్యం కాలేదనీ, ప్రస్తుతం 40 మందికి మడిగలు కేటాయించామన్నారు. మిగతా అర్హులందరికీ మడిగలు వచ్చేలా పోరాటం చేస్తామన్నారు. కోర్టులో ఉన్న కేసు గెలిచిన తరువాత అందరికీ ఇద్దామని మార్కెట్ సెక్రెటరీ చెప్పడం జరిగిందని గుర్తు చేశారు.మార్కెట్లో ఉన్న చెత్త కుండినీ మరోచోటికి తరలించాలని ఓమయ్య కోరారు. మరుగుదొడ్ల వద్ద నీటి సమస్య ఉందని, పెద్ద వర్షాలు వస్తె వర్షపు నీరు నిలిచిపోతుందని, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్తకుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, హోల్సేల్, రిటైల్ వర్తకులు, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అలీసాగర్ అటవీప్రాంతంలో చెట్టుకు" ఉరి" వేసుకొని యువకుడు ఆత్మహత్య.

ఎడపల్లి,సెప్టెంబర్ 9: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం రాణాకలాన్ గ్రామ శివారులోని అలీసాగర్ అటవీ ప్రాంతంలో కుర్మే సదానంద్(25)అనే యువకడు బుధవారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ ము త్యాల రమ తెలిపారు.ఆమె తెలిపిన వివరాలు ప్రకా రం..ఎడపల్లి మండలం అంబం(వై)గ్రామానికి చెందిన కుర్మే సాయిలు కొడుకు సదానంద్ బి.టేక్ పూర్తి చేశా డు.సదానంద్ హైదరాబాద్ లో కాంపేటేటివ్ ఎగ్జామ్ కు ప్రిపేర్ అవుతు న్నాడు అని తెలిపారు.అయితే బుధవా రం హైదరాబాద్ నుండి ఇంటికి వస్తున్నాని ఇంట్లో వాళ్ళకి చెప్పినాడు.ఉదయం అందాజా 10:37 గంటల కు తన బాబాయ్ ఒనిగొందే మల్లేష్ కుమార్ కు నేను ఎంత చదివిన రావడం లేదు,నేను చనిపోతున్నాను, జాన్కం పేట నుండి అలీసాగర్ వైపు వెళ్తున్నాను అని మెస్సెజ్ పెట్టాడు అని అన్నారు.లొకేషన్ కూడా పెట్టా డని,లొకేషన్ కు సదానంద్ బాబాయ్, అలాగే వాళ్ళ నాన్న చేరుకొనే సరికి అలీసాగర్ వద్ద అటవీ ప్రాంతం లో తను తెచ్చుకున్న బెడ్ షిట్ తో చెట్టుకు ఉరి వేసుకొా ని కనిపించాడు అని ఎస్ఐ తెలిపారు.వెంటనే సదానంద్ ను నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుప త్రికి తరలించగా, అప్పటికే మృతి చెంది ఉన్నాడని డాక్టర్ లు తెలిపారు.మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమ తెలిపారు.

## ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి.

ప్రైవేట్ కళా శాలల యాజమాన్యం డిమాండ్.
బోధన్ లో ఫీజు బకాయిల కోసం ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మానవహా రం...



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 9: (ప్రజా గళం) గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ట్యూషన్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ,తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ,పీజీ కళాశాలల యాజమాన్య సంఘం పిలుపు మేరకు బోధన్‌లో బుధ వారం రెండో రోజు నిరసన కార్యక్రమం నిర్వహించా రు.ఉషోదయ డిగ్రీ కళాశాల,ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణల్లో ప్రిన్సిపాళ్లు,అధ్యాపకులు,విద్యా ర్థినీ,విద్యార్థులు మానవహారం చేపట్టి ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కళాశాలల యా జమాన్యాలు మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సిబ్బంది వేతనాలు,కళాశాల నిర్వహణ,విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ఆర్థిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరసనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని,పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.కళాశాలల సమస్యల పరిష్కారాని కి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# ఇందూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 9 ( ప్రజాగళం ) నియోజకవర్గ అభివృద్ధికి సహకరించి నిధులు మంజూరు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. అసెంబ్లీ లో బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగర అభివృద్ధి కొరకు స్పెషల్ ఫండ్ రూ. 200 కోట్లు ఇవ్వాలన్నారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రే టెడ్ స్కూల్, తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఫార్మసీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. నగరంలో ట్రాఫిక్ సమస్య ను దృష్టి పెట్టుకొని ఔటర్ రింగ్ రోడ్ లను మంజూరు చేయాలన్నారు. గతంలోనూ అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రధానంగా ఇందూరులో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని, కళాభారతి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. రాజారాం




స్టేడియం ఆధునికీకరణ తో పాటు పాత కలెక్టరేట్ మైదానంలో సింథటిక్ ట్రాక్ తో కూడిన స్టేడియం, అలాగే ఇండోర్ స్టేడియం మంజూరు చేయాలని కోరాను. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇందూరు ఖిల్లా రామాలయం అభివృద్ధి తో పాటు రెవెన్యూ శాఖ నుంచి దేవాదాయ శాఖకు బదిలీ చేయాలన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో మరమ్మత్తులు, మౌలిక సౌకర్యాలకు నిధులు విడుదల చేయాలని, వైద్యులు సిబ్బంది కొరత లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా బస్టాండ్ ఆధునికీకరణ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

# ఈ నెల 10న ఎడ్ల పొలాల అమావాస్య,14న గణేష్ చవితి,25న నిమజ్జనం పండగలు జరుపుకోవాలి.

ఎడపల్లి,సెప్టెంబర్ 9: (ప్రజా గళం) ఎడ్ల పొలాల అమావాస్య పండగను ఈ నెల 10.వ తేదీ గురువారం నిర్వహించుకోవాలని గ్రామ పురోహి తులు సాంబశివ మహారాజ్ తెలిపారు. 10వ తారీకున గురువా రం రోజున,శుక్రవారం ఉదయం మాత్రమే అమావాస్య ఉంది కాబట్టి గురువారం మాత్రమే పొలాల అమావాస్య చేసుకోవాలని పురోహితులు తెలిపారు. అలాగే గణేశ ఉత్సవాలు ఈ నెల 14 వ తారీకు సోమవారము గణేష్ ఉత్సవాలు ప్రారంభం అయి,25 తారీకునా నిమజ్జనం చేయడం జరుగుతుంది అని తెలిపారు. అయితే ఈ సారి 12 రోజులకు నిమజ్జనం చేయాలి అని,కార ణం మన ఊరిలో మనము ఎప్పుడూ అనంత చతు ర్దశి రోజున నిమజ్జనం చేస్తాము,ఈసారి అనంత చతు ర్దశి 12వ తేదీ రోజున వచ్చింది కాబట్టి 25 తారీఖు రోజున నిమజ్జనం చేయాలి అని గ్రామ పురోహితులు సాంబశివ మహారాజ్ తెలిపారు.



# అయ్యప్ప ఆలయంలో అన్నదానం

ఆర్మూర్ సెప్టెంబర్ 9 (ప్రజగళం) ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని జంబిహాన్ ఆలయ



ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం నగేష్ శర్మ గురు స్వామి చేతుల మీదుగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ అయ్యప్ప సేవాసమితి అన్నదాన కార్యక్రమానికి వితరణగా 2 బఫ్ టేబుల్లను పూల ప్రసాద్, 20 కుర్చీలను మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ నరేందర్ లు దాతలుగా అందజేశారు. సహృదయంతో స్పందించిన దాతలను ఆర్మూర్ సేవ సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు పుట్టి మురళి మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన వితరణ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లవేళలా ప్రతి ఒక్కరీ సహాయ సహకారాలు ఇలాగే ఉండాలని, ఆ హరిహరుని కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి కార్యదర్శి మీసాల రవి, కోశాధికారి గాజ రెడ్డి నర్సరెడ్డి, గౌరవ అధ్యక్షులు జనార్దన్ గౌడ్, ముఖ్య సలహాదారులు దత్తు, మీసాల రాజేశ్వర్, ద్యాగ ఉదయ్, బాల్కొండ రాజు, పూల ప్రసాద్, నందు, గంగాధర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు భూపేందర్, శాల ప్రసాద్, గంగూలీ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలను సభ్యత్వం రద్దు చేయాలి

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

ఆర్మూర్ సెప్టెంబర్ 9 (ప్రజాగళం) తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలను సభ్యత్వం రద్దు చేయాలి .అసెంబ్లీ స్పీకర్ అంటే రాష్ట్ర శాసనసభ అధ్యక్షత వహించే అత్యున్నత అధికారి. వ్యవస్థలోసభా పతి.సభా కార్య కలాపాలను నియంత్రించడం, క్రమ శిక్షణతో కూడిన చర్చలు జరిగేలా చూడటం.ఎవరు, ఎప్పుడు మాట్లాడాలి అనేది స్పీకర్ నిర్ణయించడం.బిల్లులు, తీర్మానాలు, ప్రశ్నలపై




సభలో చర్చకు అనుమతి ఇవ్వడం.సభలో అవిశ్వాస తీర్మానం వంటి కీలక ప్రక్రియలను నిర్వహించడం. అలాంటి గొప్ప వ్యక్తులను ఎమ్మెల్సీలు కించపరిచే విధంగా మాట్లాడడం సరి అయిన పద్ధతి కాదనీ. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు. వారిని ప్రోత్సహించిన పార్టీని కూడా తెలంగాణలో నామరూపాలు లేకుండా చేయాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గంట సదానందం. మారా చంద్రమోహన్. వెంకట్రాంరెడ్డి. గోపాల్. పోచన్న. బొంబాయి మల్కన. కౌన్సిలర్లు. సర్పంచులు. పార్టీ మండలాల అధ్యక్షులు. నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బస్తీ దావకాన ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

నిజామాబాద్,సెప్టెంబర్ 9,ప్రజాగళం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ మేడం గారు ముదక్పల్లి పి హెచ్సీ పరిధిలోని కానాపూర్ నందుగల బస్తి దావకానను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు హాజరు పట్టికను, రికార్డ్స్ ను, ఓపెన్ రిజిస్టర్లు, ఔషధాల స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణకు సరిపడా మందుల ను అందుబాటులో ఉంచుకోవాలని తెలియజేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని, తద్వారా ఔట్ పేషెంట్ రోగుల సంఖ్య పెంచాలని సూచించారు. జీవనశైలి వ్యాధులు నిర్ధారణ చేస్తూ అవసరమైన వారికి రిఫర్ చేయాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో బస్తి దావకన సిబ్బంది ఉన్నారు.



## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చొరవతో

# ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు నీటి విడుదల.

నిజామాబాద్ సెప్టెంబర్ 9 ( ప్రజాగళం ప్రతినిధి) గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు నీటి విడుదలకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేయాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ విరామ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలిసిన మహేష్ కుమార్ గౌడ్, గుత్ప అల్లీ సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను వివరించారు. ప్రస్తుత సాగు పరిస్థితులు, రైతుల అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తిపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రాజెక్ట్‌కు నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



దీంతో గుత్ప అల్లీ సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు నీటి విడుదలకు మార్గం సుగమమైంది. ప్రాజెక్ట్‌కు నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి లభ్యత మెరుగుపడి, పంటలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న మహేష్ కుమార్ గౌడ్‌కు రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

# ప్రేమించిన అమ్మాయి కోసం యువకుని బలవన్మరణం.

## సెల్ఫీ వీడియో తీసుకొని తనువు చాలించిన యువకుడు. మరియా తండాలో విషాదకర ఘటన.



నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 9 (ప్రజాగళం) ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి మరో యువకునితో పెళ్లికి సిద్ధం కావడం పట్ల తట్టుకోలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్య చేసుకునే ముందు సెల్ఫీ వీడియోలో తన ఆవేదనను వెలిబుచ్చారు. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం మరియా తండాలో మంగళవారం చోటు చేసుకోగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని ఓ యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం మరియా తండాలో చోటు చేసుకుంది. ప్రేమించిన అమ్మాయి మరొకరితో పెళ్లికి సిద్ధం కావడంతో మరియా తండాకు చెందిన బానోత్? విజయ్?(22) తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య కు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియోలో వెల్లడిం చాడు. స్థానికంగా ఓ యువతిని కొన్నాళ్లుగా ప్రేమిస్తున్నానని అయితే ఆ యువతి విజయ్‌తో కాకుండా మరొకరితో పెళ్లికి సిద్ధమైందని అని వీడియోలో తెలిపాడు. అమ్మా,నాన్నలు బాగుండాలని తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ధర్పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అతడి వద్ద ఉన్న మొబైల్ లోని వీడియో ఆధారంగా ప్రేమించిన యువతి వదిలేసిందనే కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా పోలీసులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. యువకుని ఆత్మహత్యతో తల్లిదండ్రులు కన్నూర్ మున్నీరుగా విలపించారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

## నిరుద్యోగ యువతకు కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపు. పోలీస్ ఉద్యోగార్థుల ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరం సందర్శన.






నిజామాబాద్, సెప్టెంబర్ 09 ( ప్రజాగళం ప్రతినిధి): పోలీసు శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన దృష్ట్యా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. పోలీస్ శాఖలో ఎస్.ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్ధులలో సుమారు 200 మందిని ఎంపిక చేసి, జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రీ-రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. ఉద్యోగార్థులకు భోజన వసతిని సమకూరుస్తూ రెండు నెలల పాటు నిష్ణాతులచే థియరీ, దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చాటేలా శిక్షణ అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు , నిపుణులచే అభ్యర్థులకు మెళకువలు నేర్పిస్తూ, అన్ని విధాలుగా సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతున్న ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా అభ్యర్థులకు విలులైన సలహాలు, సూచనలు అందించారు. రీజనింగ్ ఎబిలిటీ, ఆంగ్లం, గణితం అంశాలలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన పద్ధతుల గురించి మెళకువలు తెలియజేశారు. ఉద్యోగార్థులకు తానే స్వయంగా నైపుణ్య సామర్థ్య పరీక్షలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తేనే కొలువు సాధించగల్గుతారని సూచించారు. గమ్యాన్ని చేరుకునే వరకు నిరంతర ప్రయత్నాన్ని కొనసాగిస్తూ ధృడ సంకల్పంతో ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. ప్రపంచంలో అసాధ్యం అన్నది ఏదీ లేదని, సరైన ప్రణాళిక, కష్టపడే తత్వం, సానుకూల దృక్పథంతో కూడిన కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని ఉద్యోగార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందింపజేశారు. రెండు నెలల పాటు సెల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, ముందస్తు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. అంకితభావం, పట్టుదల, ఏకాగ్రతతో చదువుతూ ఉచిత శిక్షణ తరగతులను కొలువుల సాధనకు అనుకూలంగా మలచుకోవాలని సూచించారు. అనవసర భయాలను విడనాడి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, నిరంతర సాధన ద్వారా పోలీస్ రిక్రూట్ మెంట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ, హైదరాబాద్ లో అందించే కోచింగ్ కు ఏమాత్రం తక్కువ కాకుండా మరింత మెరుగైన మెటీరియల్ తో పాటు, నిష్ణాతులైన ఫ్యాకల్టీచే స్థానికంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయించామని చెప్పారు. ప్రీ రిక్రూట్ మెంట్ ట్రైనింగ్ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ అన్ని విధాలుగా తోడ్పాటును అందించారని జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. అర్హత కలిగిన సమర్ధవంతులైన అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాలను సాధించి, ప్రజలకు సేవలందించాలనే సంకల్పంతో జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీని ప్రాధాన్యతను అభ్యర్థులు గుర్తెరగాలని, క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, నిరంతర సాధన చేయాలని సీ.పీ సూచించారు. రెండు నెలల పాటు వినోదాలు, వేడుకలకు దూరంగా ఉండి, ఏకాగ్రతతో కృషి చేస్తే పోలీస్ శాఖలో చేరాలనే కలను సాకారం చేసుకోగల్గుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్య కిరణ్, నిజామాబాద్ ఏ.సీ.పీ ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్, సెప్టెంబర్ 09 ( ప్రజాగళం ప్రతినిధి): రాబోయే పండుగల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు డ్రగ్స్ మరియు సైబర్ నేరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలి పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై నిర్విరమంగా దాడులు నిర్వహణ , అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు డయల్ 112 గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలి నేడు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి పై గౌరవనీయులు నిజామాబాదు పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., గారు సమగ్ర సమీక్ష సమావేశం పోలీస్ కమీషనర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హల్ యందు నిర్వహించగా నిజామాబాద్ డివిజన్ ఏ.సీ.పీ , సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు , ఎస్.హెచ్. ఓ లు , ఎస్సైలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి సార్ ఆదేశాల మేరకు డ్రగ్స్ మరియు గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని , అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని , ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు , రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం , చోరీలు , మహిళలపై నేరాలు , సైబర్ మోసాలు , డ్రగ్స్ మరియు గంజాయి అక్రమ రవాణా , పేకాట , గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని , రౌడీషీటర్లు , పాత నేరస్తులు , బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి , అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని , షీ టీమ్స్ , ఈగల్ టీమ్స్ , చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు , బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. అలాగే పేకాట , గుట్కా , ఇసుక మరియు ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని , ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ , రికార్డుల నిర్వహణ , స్టేషన్ పరిశుభ్రత మరియు సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి , నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. చివరిగా శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని , రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి , సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం , రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే మరియు స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని , ఓవర్ స్పీడ్ , త్రిబుల్ డ్రైవింగ్ , మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలి. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని , వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని , వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు. ఈ కార్యక్రమం నిజామాబాద్ ఏ.సి.పి శ్రీ ప్రకాష్ యాదవ్ , సి.సి.ఆర్.బి ఎ.సి.పి శ్రీ గురునాయుడు , సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీ ఆర్. అంజయ్య , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ శ్రీధర్ రెడ్డి , సీ.ఐ లు మరియు ఎస్హెచ్ఓలు మరియు ఎస్సై , ఐటి కోర్స్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# తెలంగాణలో మరో కొత్త నేషనల్ హైవే



హైదరాబాద్:సెప్టెంబర్ 9: తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. మరో కొత్త నేషనల్ హైవే రాష్ట్ర ప్రజలకు త్వరలో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం నిర్మాణ పనులన్నీ పూర్తి అవ్వగా.. త్వరలోనే ప్రారంభోత్సవం చేసి ప్రయాణికులను అనుమతించేందుకు కసరత్తులు చేస్తున్నారు. ప్రస్తుతం హైవేపై ట్రయల్ రన్ జరుగుతుండగా.. రోడ్డుపై ఏమైనా లోపాలు, సాంకేతిక సమస్యలు ఉన్నాయా అనేది అధికారులు పరిశీలిస్తున్నారు. ట్రయల్ రన్ పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం భారత్ మాల ప్రాజెక్టులో భాగంగా వరంగల్-కరీంనగర్ మధ్య ఉన్న నేషనల్ హైవే-563ను 4 లైన్లుగా విస్తరించింది. దాదాపు 68.015 కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉండగా.. నాలుగు వరుసలుగా తీర్చిదిద్దారు. అత్యంత ఆధునిక హంగులతో నిర్మించారు. ఇందుకోసం దాదాపు రూ.1,641 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.గతంలో వరంగల్-కరీంనగర్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్ 563 కేవలం రెండు లైన్లుగా మాత్రమే ఉండేది. అంతేకాకుండా పలుచోట్ల గుంతలు ఉండటంతో పాటు రెండు లైన్ల రహదారి మాత్రమే కావడంతో రద్దీ ఎక్కువగా ఉండేది. దీని వల్ల రహదారిపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైవే విస్తరణను నడుం బిగించింది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్‌మాల ప్రాజెక్టులో కొత్తగా నాలుగు లైన్ల రహదారిగా విస్తరించింది. దీంతో వాహనదారులకు ప్రయాణం మరింత సులభం కావడంతో పాటు రద్దీ తగ్గుతుంది. దీని వల్ల వరంగల్-కరీంనగర్ మధ్య ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి గంటన్నర పట్టేది. అయితే ఈ హైవే అందుబాటులోకి వస్తే కేవలం 45 నిమిషాల్లోనే వెళ్లవచ్చని అంటున్నారు.ఈ హైవేను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లను షురూ చేశారు. అక్టోబర్ తొలి వారంలో ప్రారంభించే అవకాశముందని లేదా దసరా సందర్భంగా అందుబాటులోకి తీసుకురానున్నారని సమాచారం. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు వెళ్లగలిగే సామర్థ్యంతో ఈ రహదారిని నిర్మించారు. అంతేకాకుండా ఈ జాతీయ రహదారి రాకతో వరంగల్-కరీంనగర్ మధ్య దూరం కూడా తగ్గనుంది. 72 కిలోమీటర్ల నుంచి 68 కిలోమీటర్లకు తగ్గనుంది. ఈ హైవే నిర్మాణంలో భాగంగా 25 అండర్ పాస్‌లు నిర్మించగా.. 9 భారీ ఫ్లైఓవర్లు, 23 చిన్న వంతెనలు నిర్మించారు. శంకరపట్నం, మానకొండూరు, హుజూరాబాద్ వద్ద బైపాస్ అభివృద్ధి చేశారు. గ్రామాలకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్లపై దృష్టి పెట్టారు. ఈ హైవేపై అత్యాధునిక సౌకర్యాలు ప్రవేశపెట్టారు. ప్రతీ కిలోమీటర్‌కు సీసీ కెమెరాలతో పాటు సోలార్ లైట్లు నెలకొల్పారు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించేలా మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అలాగే అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్ కూడా ఉంది.